క్లుప్తంగా

సర్మస్ హుసేన్సీ దర్గాలో ఫాతెహాలు



అలంకరణలో స్వామి సమాధి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మస్ హుసేన్సీ స్వామి దర్గాలో భక్తులు ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. గురువారం స్వామివారం కావడంతో ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గా ఆవరణలో కందురీలు చేశారు.

ఆటోను ఢీ కొన్న ట్రాక్టర్

- ఇద్దరు మహిళలకు గాయాలు

కళ్యాణదుర్గం: పట్టణ సమీపంలోని రాయదుర్గం రోడ్డులో ముందు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు మహిళలు గాయపడ్డారు. పట్టణ పోలీసుల వివరాల మేరకు...బెళుగుప్ప మండలం తగ్గపర్తికి చెందిన డ్రైవర్ మధు బాడుగ ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని గురువారం కళ్యాణదుర్గం నుంచి కణేకల్లుకు బయలుదేరాడు. పట్టణం శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలో ఓ ట్రాక్టర్ డ్రైవర్ ముందు వైపు వెళ్తున్న ఆటోను ఢీ కొన్నాడు. దీంతో ఆటోలో వెనుక వైపు కూర్చున్న మహిళలు యల్లమ్మ, ద్రాక్షాయిణికి గాయాలయ్యాయి. వారిని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'ప్రభుత్వ భూములు కాపాడాలి'

కళ్యాణదుర్గం రూరల్: ప్రభుత్వ భూములను కాపాడాలని సీపీఎం నాయకులు కోరారు. ఆపార్టీ జిల్లా కార్యదర్శి రాంభూపాల్ ఆధ్వర్యంలో గురువారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు రుణ సహాయం పెంచాలన్నారు. ప్రభుత్వ భూములను అధికారులు స్వాధీనం చేసుకోవాలన్నారు. కార్మికులందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ ఏఓ భూషణ్‌కు వినతి పత్రం అందజేశారు.

ఎండీయూ వాహనాలకు దరఖాస్తుల ఆహ్వానం

కూడేరు: మండలంలో ప్రభుత్వం తరపున ఎండీయూ ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులు సరఫరా చేసేందుకు మూడు వాహనాలు ఖాళీ ఉన్నట్లు సీఎస్‌డీటీ లక్ష్మీదేవి గురువారం తెలిపారు. గొటుకూరు, బ్రాహ్మణపల్లి, రామచంద్రాపురం, కమ్మూరుకు కలిపి ఒక వాహనం, కూడేరు, అరవకూరు కలిపి ఒక వాహనం, కలగళ్ల, మరుట్లకు ఒక వాహనం ఉన్నాయన్నారు. ఏడో తరగతి ఉత్తీర్ణులై, డ్రైవింగ్ లైసెన్స్ కల్గి ఉండి ఏ కులస్తులైనా సరే అర్హులన్నారు. నెలకు రూ.18 వేలు ఖాతాలోకి జమ చేస్తారన్నారు. ఆసక్తి ఉన్నవారు 91103 95876 నంబర్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు.

అంతర్ రాష్ట్ర టెన్నికాయిట్‌లో ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థినులు

శెట్టూరు: కనుకూరు ఉన్నత పాఠశాలలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు అంతర రాష్ట్ర టెన్నికాయిట్ సబ్ జూనియర్ పోటీల్లో రాణించినట్లు ప్రధానోపాధ్యాయుడు ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. అనకాపల్లిలో ఇటీవల నిర్వహించిన అంతర్‌రాష్ట్ర టెన్నికాయిట్ పోటీల్లో అనంతపురం జట్టు నుంచి కనుకూరు విద్యార్థులు అమృత మొదటి స్థానం, సుప్రియ రెండో స్థానం, రజని నాల్గవ స్థానంలో నిలిచినట్లు వారు తెలిపారు. వారిని ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

రాయదుర్గం రూరల్: మండలంలోని జంజురాంపల్లిలో శుక్రవారం ఉదయం 7 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ విద్యావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హొన్నే మల్లికార్జున, ఎంపీడీఓ కొండయ్య గురువారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని వారు కోరారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని గుడిపల్లి, గొల్లలదొడ్డి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 6.30 గంటలకు, మధ్యాహ్నం 3.30 గంటలకు బుడిమేపల్లిలో మంత్రి ఉషశ్రీచరణ్ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలన్నారు.

జగనన్న పాలనలోనే రాష్ట్రాభివృద్ధి

- గడప గడపలో మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



- ఈ ఫోటోలో కనిపిస్తున్న మహిళ పేరు మంగలి మంగమ్మ . రాయదుర్గం మండలం జుంజురాంపల్లి గ్రామం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొలువైన మూడున్నరేళ్లలో వైఎస్సార్ ఆసరా, చేయూత, ఇన్‌పుట్ సబ్సిడీ , సున్నా వడ్డీ, వైఎస్సార్ పింఛన్ కానుక, జగనన్న అమ్మఒడి, పేదలందరికీ ఇళ్లు తదితర సంక్షేమ పథకాల ద్వారా ఈమె కుటుంబం రూ.4,19,124 లబ్ధి పొందింది. మా మంచి గురించి ఆలోచించే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటామని ఆమె సంతోషం వ్యక్తం చేసింది.



కుందుర్పి: సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్



రాయదుర్గం రూరల్: బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

కుందుర్పి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి చెందడంతో పాటు సంక్షేమ పథకాలను అందించి అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటున్నారని స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. గురువారం ఉయం మండలంలోని నిజవల్లి గ్రామంలో సర్పంచ్ ప్రభాకర్, నాయకులు, అధికారులతో కలసి మంత్రి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలను తెలుసుకుంటూ సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు చేరుతున్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నాయకుల చుట్టూ నెలలు తరబడి తిరిగితే తప్పా పథకాలు అందేవి కావని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపిస్తేనే సంక్షేమ పథకాలు సకాలంలో అందుతాయని, మనమందరం సమన్వయంతో పనిచేసి మరోసారి జగనన్నను సీఎం చేసుకొందామని సూచించారు.అంతకు ముందు నిజవల్లి గ్రామ సచివాలయాన్ని మంత్రి సందర్శించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, కోఆప్షన్ సభ్యుడు ముజీ, వైస్ ఎంపీపీ బీజప్ప, సచివాలయ కన్వీనర్లు మల్లయ్య, గోపాల్, నాగరాజు, నరసప్ప, జెడ్పీ మాజీ సభ్యుడు రాజగోపాల్, మాజీ ఎంపీటీసీలు ఎర్రన్న, తిప్పేస్వామి, నాయకులు బాబు, రంగనాథ్, కృష్ణారెడ్డి, రమేష్, బోయరాజు, నగేష్, డీలర్ల సంఘం అధ్యక్షులు రాము తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం

బ్రహ్మసముద్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖమంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. గురువారం మండలంలోని ముద్దలాపురం, కన్నేపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పరిపాలను తీసుకొచ్చారన్నారు. లబ్ధిదారుల ఇంటివద్దకే వచ్చి సంక్షేమ పథకాలు నేరుగా అందిస్తున్నామని గుర్తుచేశారు. ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రభావతి, ఎంపీపీ చంద్రశేఖరరెడ్డి, ఏడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రామాంజినేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, వీరశైవ లింగాయత్ డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి, జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి అశోక్‌రెడ్డి, రైతు సంఘం నాయకుడు గోపాలరెడ్డి, వైస్ ఎంపీపీలు సునందమ్మ, వెంకటేష్ నాయక్ , సర్పంచ్‌లు రామ్మోహన్, ఆదినారాయనరెడ్డి, నాయకులు పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రాయదుర్గం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పరిపాలనలోనే ప్రజా సంక్షేమం విరాజిల్లుతోందని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని జుంజురాంపల్లిలో గురువారం ఆయన జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ పుష్పావతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మల్లికార్జునతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. విప్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరింత లబ్ధి చేకూరాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండేలా వైఎస్ జగనన్నకు అండగా నిలవాలని కోరారు. మాయమాటలు చెబుతూ వంచించడానికి వచ్చే టీడీపీ నాయకులను నమ్మి మోసపోవద్దన్నారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు మాత్రమే దోచుకుని పందికొక్కుల్లా బలిసిపోయారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చి మాట నిలబెట్టుకున్న సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాత్రమే అన్నారు. కరోనా కష్టకాలంలోను మా ప్రభుత్వం ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించిందని, మా కుటుంబం కూడా రాయదుర్గం నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉండి ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి అండగా నిలిచిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు హైదరాబాదులోని నివాసం నుంచి బయటకు రాలేదన్నారు. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు కూడా అనంతపురం వదిలి రాయదుర్గంలో అడుగుపెట్టలేదన్నారు. అలాంటి నాయకులను ఎన్నటికీ నమ్మవద్దని హితవు పలికారు. వచ్చే ఎన్నికల్లో మీకు మంచి చేస్తున్న వైఎస్సార్‌సీపీకే మద్దతివ్వాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మల్లికార్జున, ఎంపీటీసీ మఠం సురేష్, మండల కోఆప్షన్ సభ్యుడు దిలావర్ బాషా, రేకులకుంట సర్పంచ్ ఎర్రిస్వామిరెడ్డి, మాజీ ఎంపీపీ మఠం కుమారస్వామి, శివారెడ్డి, జుంజురాంపల్లి మఠం మంజునాథ, జగదీష్, మహేష్ స్వామి, హనుమంతరాయుడు, కొల్లన్న, కెంచానపల్లి బుజ్జి, మురారి, నారాయణ నాయక్, మలకాపురం నాగరాజు, తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ కొండయ్య, ఈఓపీఆర్డీ రఘురామారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ



పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ పుష్పావతి

విడపనకల్లు: 'నాడు–నేడు'తో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ కలుగుతోందని ఎంపీపీ కరణం పుష్పావతి అన్నారు. గురువారం మండలంలోని గడేకల్లు జెడ్పీ హైస్కూల్లో నాడు–నేడు రెండో విడత కింద దాదాపు రూ.1.50 కోట్లతో అదనపు తరగతి గదులు, వివిధ నిర్మాణ పనులు ఎంపీపీ పరిశీలించారు. పనుల్లో కూడా నాణ్యతగా ఉండాలని హెచ్ఎం నారాయణరెడ్డికి సూచించారు. జగనన్న విద్యా కానుక, విద్యా దీవెన, అమ్మ ఒడి తదితర పథకాలతో నిరుపేద విద్యార్థులకు అండగా నిలుస్తున్న గొప్ప మనసున్న మహారాజు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీపీ కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచు సుశీల, మాజీ సర్పంచు కరణం భీరెడ్డి, ఎంపీటీసీ ఓబుళేసు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ మనీషా, శివయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ షేక్షావలి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

కుందుర్పి: మండల కేంద్రంలోని పలు వీధుల్లో రూ.10 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు పనులను గురువారం ఎంపీపీ కమలమ్మ, సర్పంచ్ మారుతేశ్వరి ప్రారంభించారు. మండల పరిషత్ నిధులతో ఎస్సీ కాలనీలో సీసీరోడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ నారాయణస్వామి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు గంగమ్మ, జెడ్పీ మాజీ సభ్యుడు రాజగోపాల్, నాయకులు నారాయణస్వామి, గోపాల్, వార్డు మెంబర్ దురగమ్మ తదితరులు పాల్గొన్నారు.

లత్తవరం తండాను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



ఆర్వో ప్లాంటు ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, యువజన నాయకుడు ప్రణయ్‌రెడ్డి

ఉరవకొండ రూరల్: లత్తవరం తండా పంచాయతీని నియోజకవర్గంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, రాష్ట్ర యువజన నాయకుడు వై. ప్రణయ్‌రెడ్డి అన్నారు. గురువారం ఉరవకొండలోని విశ్వేశ్వరరెడ్డి స్వగృహం నుంచి లత్తవరం తండా వరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వందలాది వాహనాలతో విజయ సంకల్పయాత్ర నిర్వహించారు. విజయ సంకల్పయాత్రకు వచ్చిన వారికి సర్పంచ్ అన్నపూర్ణమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు చిట్టెమ్మ నాయకులు ప్రసాద్‌నాయక్, నాగరాజునాయక్, వెంకటేశ్‌నాయక్, వెంకటానాయక్, ఎర్రిస్వామి నాయక్ తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం లత్తవరం నుంచి లత్తవరం తాండా వరకు రూ. 1.35 కోట్లతో 1.5 కిలోమీటర్ల బీటీ రోడ్డుకు వారు భూమిపూజ చేశారు. రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంటును ప్రారంభించారు. అనంతరం భారీ బహిరంగ సభలో ప్రణయ్ మాట్లాడుతూ వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే లత్తవరం తండాను ప్రత్యేక గ్రామ పంచాయతీగా గుర్తింపు తీసుకువచ్చామన్నారు. పంచాయతీలో దాదాపు రూ.2.5 కోట్ల అభివృద్ధి పనులు చేశామన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ తెలుగుదేశం పగటి వేషగాళ్ల ప్రజలను మరోసారి మోసం చేయడానికి వస్తారని, వారిని నమ్మొద్దన్నారు. మాటిస్తే మరిచిపోని నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. అనంతరం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన తులసేనాయక్, గోపాల్‌నాయక్, చంద్రశేఖర్ నాయక్‌తోపాటు 10 కుటుంబాలు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ చందా చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ పార్వతమ్మ, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ సుంకన్న, పీఏసీఎస్ చైర్మన్ తేజోనాథ్, పెన్న హోబిలం ఆలయకమిటీ మాజీ చైర్మన్ అశోక్, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోవిందు, సర్పంచ్‌లు వంశీ, సిద్ధార్థ, పార్టీ కన్వీనర్ ఓబుళేసు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్‌వైఎస్‌ఎల్ క్రీడా సంబరం



ఫైనల్‌కు చేరిన క్రికెట్ జట్లను అభినందిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, యువనేత కాపు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

రాయదుర్గంటౌన్: వైఎస్సార్‌సీపీ యువనేత కాపు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రాయదుర్గం యూత్ స్పోర్ట్స్ లీగ్–2(ఆర్‌వైఎస్‌ఎల్) సంక్రాంతి క్రీడా సంబరాలు అంబరాన్నంటాయి. జూనియర్ కళాశాల మైదానంలో శనివారం క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, హాకీ ఫైనల్ పోటీలు నిర్వహించనున్నారు. గురువారం సెమీఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా కొనసాగాయి. ఉత్కంఠ పోరులో రాయదుర్గం ఫ్రెండ్స్ లెవన్, గుమ్మఘట్ట లయన్స్ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. శాంతినగర్ బీ జట్టుపై గుమ్మఘట్ట లయన్స్ గెలుపొందగా గౌనికుంట జట్టుపై రాయదుర్గం ఫ్రెండ్స్ లెవన్ గెలుపొందింది. సెమీఫైనల్ క్రికెట్ మ్యాచ్‌లను ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, కాపు భారతి దంపతులతోపాటు వైఎస్సార్‌సీపీ యువనేత కాపు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, లేఖ్యారెడ్డి దంపతులు తిలకించి ఫైనల్‌కు చేరిన జట్లను అభినందించారు. సాయంత్రం ఫ్లడ్‌లైట్ల వెలుగులో హాకీ, జూడో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇల్లూరి శ్రీనివాసులు, మార్కెట్‌యార్డు చైర్మన్ భోజరాజు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ముస్తాక్, కౌన్సిలర్ డిష్ గోవిందు, సర్పంచ్ ఉమేష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జ్‌లు సునార్ ఇస్మాయిల్, బషీర్ అహ్మద్, గోరంట్ల సత్యనారాయణ, ఆర్గనైజర్లు ఓబ, బషీర్, మురళి, శ్రీనివాసులు, అమరేష్, శివరాజ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి జ్యోతుల మహోత్సవం



అలంకరణలో చౌడేశ్వరీదేవి

రాయదుర్గం: పట్టణంలోని నేసేపేటలో ప్రసిద్ధి చెందిన చౌడేశ్వరిదేవి పంచమ జ్యోతుల మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే అమ్మవారి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం లాంటి పూజా కార్యక్రమాలు చేపట్టాక, తొగట వీరక్షత్రియ కుల బాంధవులు పెద్ద ఎత్తున ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆకుపూజ, పూలు, నిమ్మకాయల హారాలతో అందంగా అలంకరించి, అమ్మవారికి వడిబియ్యం సమర్పించారు. ఆలయం వద్ద అన్నదానం, తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. సాయంత్రం వేదమంత్రోచ్ఛారణల మధ్య అమ్మవారిని గంగ పూజకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా చిన్నారుల కోలాటం, ఖడ్గ ప్రదర్శన ఆకట్టుకున్నాయి. అమ్మవారి ఉత్సవాలు మరో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి చౌడేశ్వరిదేవి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విప్‌తో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ పోరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ నాయకుడు పోరాళ్ల శివను సన్మానించారు. వైస్ చైర్మన్లు వలీబాషా, శ్రీనివాస్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ముస్తాక్, ఆలయ కమిటీ ధర్మకర్త శ్రీరాములు, కమిటీ అధ్యక్షుడు కృష్ణమూర్తి, కార్యదర్శి హనుమంతు, తొగవీరక్షత్రియ సంఘం అధ్యక్షుడు మద్దిలేటి ప్రభాకర్, కార్యదర్శి వెంటరమణ బాబు, కోశాధికారి ఎం.సత్యనారాయణ, లోకేష్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జన్మదినం సందర్భంగా సామాజిక కార్యక్రమాలు

రాయదుర్గం: ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సతీమణి జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ చైర్‌పర్సన్ కాపు భారతి జన్మదినం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని పలు సామాజిక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఉదయం 11 గంటలకు విప్ స్వగృహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు, రెడ్‌క్రాస్ సిబ్బంది, రక్త దాతలతో కలసి కేక్ కట్ చేసి సంబరాల్లో పాల్గొంటారు. అనంతరం ఆస్పత్రులు, అనాథాశ్రమాల్లో రోగులు, వృద్ధులకు పాలు, బ్రెడ్డు, పండ్ల పంపిణీ చేయనున్నారు.

వీధిలైట్ల ఏర్పాటు

విడపనకల్లు: మండల పరిధిలోని కరకముక్కల గ్రామంలో సర్పంచ్ రామాంజనరెడ్డి గురువారం వీధిలైట్లు ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో ఉప సర్పంచు పెద మల్ల, సచివాలయ విద్యుత్ లైన్‌మెన్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దేవర పోతు మృతి

కళ్యాణదుర్గం రూరల్: మండల పరిధిలోని బోరంపల్లి, పాతచెరువు గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవర పోతు మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. కళ్యాణదుర్గం వైపు నుంచి అనంతపురం వైపుగా వెళుతున్న గుర్తు తెలియని కారు ఢీ కొనడంతో దేవర పోతు మృతి చెందింది. బోరంపల్లి గ్రామ దేవత మారెమ్మకు వదిలిన దేవర పోతుగా గ్రామస్తులు గుర్తించారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత



7వ వార్డు భూమి పూజలో పాల్గొన్న విప్ కాపు

రాయదుర్గం: అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమ ప్రాధాన్యత కల్పిస్తు.. రాష్ట్రాన్ని అన్నీ రంగాల్లోనూ ముందుకు నడిపిస్తున్నారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని 5, 7వ వార్డుల్లో గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.25.43 లక్షల నిధులతో సీసీ రహదారుల నిర్మాణానికి గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ పోరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకరరెడ్డి, వైస్ చైర్మన్లు వలీబాషా, శ్రీనివాస్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ముస్తక్, నాయకుడు పోరాళ్ల శివతో కలసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విప్ కాపు మాట్లాడారు. పట్టణంలోని ప్రతి సచివాలయం పరిధిలోనూ రూ.20 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఏళ్ల తరబడి మట్టికే పరిమితమైన దారులను సీసీ రోడ్లుగా మార్చు తీసుకువచ్చామన్నారు. గత టీడీపీ హయాంలో అప్పటి పాలకుల నిర్లక్ష్యం, దోపిడీ కారణంగా రాయదుర్గం లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. పోతుపోతూ రూ.20 కోట్ల విద్యుత్ బిల్లులు కూడా ప్రభుత్వం పై భారం మోపి వెళ్లారని మండిపడ్డారు. ఆఖరుకు ట్రాక్టర్లు, వాటి టైర్లతో పాటు బోర్లలో మోటార్లు అమ్ముకున్న హీనచరిత్ర టీడీపీ కౌన్సిలర్లదని ధ్వజమెత్తారు. రాయదుర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా భవిష్యత్‌లో మరిన్ని మంచి పనులు చేసి చూపిస్తామన్నారు. ప్రజా సంక్షేమం దృష్ట్యా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటినీ సందర్శించి సమస్యలు తెలుసుకుని పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి రాజకీయ సమాధి తప్పదన్నారు. కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు, డీఈ రామ్మూర్తి, క్లాస్–1 కాంట్రాక్టర్లు కొత్తపల్లి సత్యనారాయణ, ఆర్టీ కాంతారెడ్డి, వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

పంటల సాగులో మెలకువలు పాటించాలి



గడేహోతూరులో పప్పుశనగ పంట పరిశీలిస్తున్న డీఆర్‌సీ ఏడీఏ శైలాకుమారి

వజ్రకరూరు: తెగుళ్ల నివారణకు రైతులు జాగ్రత్తలు పాటించాలని అనంతపురం డీఆర్‌సీ ఏడీఏ శైలాకుమారి సూచించారు. గురువారం మండలంలోని గడేహోతూరు గ్రామంలో పప్పుశనగ, మిర్చి తదితర పంటలను అధికారులతో కలసి ఆమె పరిశీలించారు. పప్పుశనగ పంటలో వేరుకుళ్లు తెగుళ్లు, మిర్చి పంటలో నల్లతామర పురుగును గుర్తించారు. ఏడీఏ మాట్లాడుతూ పంటలకు మందులు పిచికారి చేసే సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వ్యవసాయ అధికారులు సూచించిన మందులనే పంటలకు పిచికారీ చేయాలన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథ కాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏఓలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రుమానాబేగమ్, ఏఈఓ జానమ్మ, వీఏఏ ఇందు, రైతులు తిమ్మారెడ్డి, పరమేష్, ఆర్‌బీకే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉరవకొండ మండలం బూదగవి గ్రామంలో కూడా డీఆర్‌సీ ఏడీఏ, ఏఓలు పర్యటించి రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించి సలహాలు, సూచనలు అందించారు.

యువతకు నిర్దిష్టమైన లక్ష్యం అవసరం



విద్యార్థులకు స్కాలర్‌షిప్ పంపిణీ చేస్తున్న స్వామి అర్చనానంద

రాయదుర్గంటౌన్: యువతకు నిర్దిష్ట లక్ష్యం అవసరమని, లక్ష్యం లేని జీవితం వ్యర్థమని శారదాదేవి ట్రస్ట్ చైర్మన్ స్వామి అర్చనానంద అన్నారు. గురువారం పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో విశ్వాచార్యస్వామి వివేకానంద 160వ జయంతి వేడుకలను శారదాదేవి శాశ్వత జ్ఞాననిధి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ తరపున ఎంబీబీఎస్, బీటెక్, ఫార్మసీ చదివే 15 మంది పేద విద్యార్థులకు రూ.1.60 లక్షల స్కాలర్‌షిప్ స్వామి అర్చనానంద అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన జయంతి ఉత్సవంలో ఆయన మాట్లాడుతూ ఆత్మ విశ్వాసం, లక్ష్య సాధన ఉంటేనే ఎలాంటి రంగాల్లోనైనా రాణించవచ్చన్నారు. వివేకానంద లాంటి గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని చదువుకు పేదరికం అడ్డురాదని నిరూపించాలన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు మేకల శ్రీనివాసులు, దాతలు, ట్రస్ట్ సభ్యులు, వివేకానంద యూత్ ఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు.

వివేకానందుడి జీవితం ఆదర్శప్రాయం

రాయదుర్గం రూరల్: స్వామి వివేకానంద జీవితం యువతకు ఆదర్శప్రాయమని వక్తలు అన్నారు. మండలంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నారాయణ, గోవర్ధన్, రామకృష్ణ, నాగమణి , బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం స్వామి వివేకానందుడి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జేవీవీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, రీసర్వే డిప్యూటీ తహసిల్దార్ కేశవరెడ్డి, రిటైర్డు ఎంపీహెచ్‌ఈఓ పట్టాభాజాపీరా, ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు బెంజ్‌మెన్ తదితరులు పాల్గొన్నారు..

ఆధార్ అనుసంధానం వేగవంతం చేయండి

బొమ్మనహాళ్: ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియను వేగవంతం చేయాలని తహశీల్దార్ శ్రీనివాసులు సూచించారు. గురువారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆధార్ అనుసంధానానికి ఓటర్ల నుంచి ఫారం 6బీ స్వీకరించాలని, గరుడ యాప్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే ఓటరు జాబితాలో తప్పులను సరిచేయాలని సూచించారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు: ఎస్‌ఐ

కూడేరు: సంక్రాంతి పండుగ వేళ కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సత్యనారాయణ హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిఒక్కరూ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆయన సూచించారు. గ్రామీణ సంప్రదాయ క్రీడలను నిర్వహించుకోవచ్చన్నారు. మండలవ్యాప్తంగా పోలీసు నిఘా ఉంటుందన్నారు. డబ్బు ఆశతో కోడి పందేలు, జూదాలు జోలికి వెళ్లవద్దన్నారు. ఎక్కడైన కోడిపందేలు, జూదాలు నిర్వహిస్తే 9440796814 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.